
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





# కాంగ్రెస్ వస్తే కరెంట్ ఖతమే

## హస్తం పార్టీ హయాం అంతా కరెంట్ కోతలే..

**నాడు విద్యుత్ లేక అన్నదాత అవస్థలు**

**ఇప్పుడు మళ్లీ 3 గంటల కరెంట్ చాలంటూ బూటకం**

**కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని రైతుల ఆగ్రహం**

దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న 24 గంటల కరెంట్ సరఫరాను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నది. రైతులు సుభిక్షంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతున్నది. అందుకే రైతులకు 3 గంటల కరెంట్ చాలని ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా వాగుతున్నారు. అంతటితో ఆగకుండా రైతులు 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే సరిపోతుందని ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీనిపై రైతులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. సంతోషంగా ఉన్న అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, 3 గంటల కరెంట్‌తో మూల కూడా తడవదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నాశనం కోరుకునే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని, ఓట్ల కోసం వస్తే ఉరికించి కొడతామని దుమ్మెత్తిపోస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)

### మూడు గంటల కరెంట్‌తో ఒక్క మూల కూడా తడవదు

కాంగ్రెసోళ్లు చెప్పినట్టు మూడు గంటల కరెంటు ఇస్తే ఎకరంలో ఒక మూల కూడా తడవదు. నిరంతర విద్యుత్ ఇస్తేనే రైతులు పంటలు పండిస్తారు. పదేండ్ల సంది కరెంట్ కష్టాలు తెల్వదు. గతంలో అయితే బావులకు విడతల వారీగా, ఇండ్లకైతే రాత్రి వేళల్లోనే ఇచ్చేవాళ్లు. కేసీఆర్ సార్ వచ్చినంక భూములన్నీ పచ్చని పంటలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ రైతులకు అప్పుల తిప్పలు తప్పవు. కాంగ్రెస్ నాయకులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. ఆ మోటర్లు పెట్టుకోవాలంటే రైతుల మీద మోయలేని భారం పడుద్ది. 5 హెచ్‌పీ మోటర్లు పెడితేనే ఎక్కువ. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి భూగర్భ జలాలు తగ్గించి కరువును కొని తెచ్చుకునుడే అవుద్ది. రైతులు క్షేమంగా ఉండాలని కోరుకునేది కేసీఆర్ సారు ఒక్కరే. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– చిలుముల ఏసు, ఉండ్రుగొండ, చివ్వెంల మండలం



### మాకు 24 గంటల కరెంట్ కావాలి

గత ప్రభుత్వ కాలంలో నీళ్లు లేక, కరెంట్ లేక భూమి బీడుగా మారింది. బతకడమే చాలా కష్టమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడిక తీసి కట్టలను నిర్మించడంతో భూగర్భ జలాలు మస్తు పెరిగినయ్. బావి తవ్వి మోటరు పెట్టుకుని వరి, పత్తి పండిస్తున్న. మంచిగా బతుకుతున్న. అంత మంచిగా ఉందనుకుంటే ఈ కాంగ్రెస్ మళ్లీ మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నది. ఆ కరెంట్‌తో మొదటి మడి కూడా పారదు. ఇంకా 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలంట. ఎట్ల పెట్టుకుంటరు.. ఎవరు కొనిస్తరు చెప్పాలి. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పాత కథే అయితట్టుంది. మాకు మూడు గంట కరెంట్ వద్దు.. 24 గంటలు ఇచ్చే సర్కారు కావాలి.

– గుగులోతు కోటేశ్‌నాయక్, గుగులోతు తండా, నూతనకల్ మండలం



### కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లే..

కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ. వాళ్లు దండిగా దోచుకుతిన్నాక మిగిలిన నిధులతో పథకాల గురించి ఆలోచిస్తారు. అలాంటి వారు తమ బుద్ధిని ఎన్నికల ముందే కుండ బద్దలయ్యేటట్టు చెప్పారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. మూడు గంటలు ఏ మూలకూ సరిపోదు. తడిసిన భూమే మళ్లీ తడుస్తుంది తప్ప.. కొత్త మడి పారదు. అలాంటప్పుడు సాగు విస్తీర్ణం చాలా తగ్గుతుంది. దీంతో రైతులు వ్యవసాయం వదిలి మళ్లీ పట్టాణాలకు వలస వెళ్లి అడ్డమీద కూలీలుగా మారే అవకాశం ఉంటుంది. రాత్రి మోటరు పెట్టడానికి వెళ్లి పురుగుబూసి కాటుకు బలైతరు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తేనే సాగు పెరిగి రైతుల బతుకులు మారాయి. పట్టణాల నుంచి పల్లెలకు వచ్చి ఉన్న కొంత భూమిలోనైనా నాలుగు గింజలు పండించుకొని సంతోషంగా ఉంటున్నారు. సీఎం కేసీఆర్ సారు రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. పంటకు పెట్టుబడి సాయం, సాగునీరు అందిస్తూ.. పండిన పంటను కూడా కొంటున్నారు. రైతుకు ఇంత కంటే ఎక్కువ ఏం కావాలి. కాబట్టి ఆగం కాకుండా ఆలోచించుకొని రైతుకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేయాలి.

– కొమ్ము రాజు, చందుపట్ల, మద్దిరాల మండలం





### మూడు గంటలంటే ముప్పతిప్పలే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ మూడు గంటలే ఇస్తదంట. అలాగైతే రైతులకు ముప్పు తిప్పలు తప్పవు. గతంలో కరెంట్ కోసం పడిన కష్టాలు కళ్లముందే కదలాడుతున్నయ్. మళ్లీ అటువంటి కష్టాలే పడాల్సి వస్తుంది. అయినా మూడు గంటల పాటు కరెంట్ ఇస్తే ఎకరం పొలం కూడా తడవదు. రోజూ తడిసిందే తడుస్తుంది తప్ప.. ఒక్క మడి కూడా ఎక్కువ పారదు. ఇగ 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే ఇప్పుడున్న స్టార్టర్లు, పైప్‌లైన్లు పనికిరావు. వాటన్నింటినీ కొత్తగా ఏర్పాటు చేసుకోవాలి. అంటే రైతులపై అదనపు భారం పడుతుంది. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని పెంచాల్సి ఉంటుంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతులకు ఏ ఇబ్బందులు లేవు. సజావుగా వ్యవసాయం చేసుకుంటున్నాం. కాబట్టి రైతులు ఎవరి ద్వారా లాభం జరుగుతుందో ఆలోచించుకున్నాకే ఓటెయ్యాలి.

– గుగులోతు సందీప్‌నాయక్, గారకుంటతండా, గరిడేపల్లి మండలం

### మూడు గంటలు వస్తే మునుపటి కథే



తెలంగాణలో పంటల సాగు గణనీయంగా పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతాంగానికి మూడు గంటల కరెంట్ ఇస్తామని ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు. ఇప్పుడున్న కాలంలో మూడు గంటల కరెంట్ ఏ మూలకూ సరిపోదు. అలా ఇస్తే మళ్లీ పాత రోజులే వచ్చి టార్చ్‌లైట్లు పట్టుకొని రాత్రనక, పగలనక మోటర్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఆ టైమ్‌లో మోటర్లు పెట్టడమంటే కత్తిమీద సామే. మూడు గంటల కరెంట్‌తో సాగు విస్తీర్ణం తగ్గుతుంది. మళ్లీ రైతులు వ్యవసాయం వదిలేసి పట్టణాలకు వలస వెళ్లి అడ్డమీద కూలీలుగా మారుతారు. కాంగ్రెస్ అంటేనే కష్టాలు, కన్నీళ్లు. అలాంటి కాంగ్రెస్ సర్కారు రావాలని ఎవరూ కోరుకోరు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత వ్యవసాయాన్ని పండుగలా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు రైతులమంతా అండగా ఉంటాం.

– భూతం ముత్తయ్య, మద్దిరాల

### కాంగ్రెస్‌ను నమ్మితే పాత రోజులే..



కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ పాత రోజులను తీసుకొచ్చేందుకు కుట్రలు చేస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. దాంతో పంటలు మంచిగా పండుతున్నాయి. ఇప్పుడిప్పుడే మా బతుకులు బాగుపడుతున్నాయి. మా బతుకులు బాగుండడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేనట్టుంది. తాము అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టిస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తే పొలాలు ఎండిపోతాయి. రైతులు కరెంట్ కోసం రోడెక్కాల్సిన పరిస్థితి వస్తది. రైతులందరూ కలిసి ఇచ్చిన మూడు గంటల్లోనే మోటర్లను ఆన్ చేస్తే సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. దేశానికి అన్నం పెట్టే వ్యవసాయాన్ని చులకనగా చూడడం సరికాదు.

– తవణం వెంకట్‌రెడ్డి, వల్లాపురం, నడిగూడెం మండలం

### కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే రైతులు మునుగుడే

కాంగ్రెసోళ్లు రైతులను నిండా ముంచాలని చూస్తుండ్రు. 3గంటల కరెంటు ఇస్తే ఎటూ సరిపోదు. పారిన కాల్వ మళ్లీ పారుతుంది తప్ప.. మడికి నీళ్లు మాత్రం పోవు. బావులు, బోర్లకు 10హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని చెప్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెడ్తే బావులు, బోర్లల్లో నీళ్లు ఉండవు. భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. రైతులందరూ ఒక్కసారిగా మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్ల మీద ఎక్కువ లోడు పడి కాలిపోతాయి. మా కష్టం మొత్తం మోటర్ల రిపేర్లకే సరిపోతుంది. ఈ కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే రైతులు నట్టేట మునుగుతారు.

– మోదుగు నాగిరెడ్డి, పిన్నాయిపాలెం, సూర్యాపేట మండలం



### మా బాధలు కాంగ్రెసోళ్లకు ఏం తెలుస్తయి..

కాంగ్రెస్ అంటేనే తలా తోక లేని పార్టీ. వాళ్లు వ్యవసాయం అంటే ఏందో తెల్వకుండా మాట్లాడుతున్నరు. వ్యవసాయం బాధలు చేసేటోళ్లకే తెలుస్తాయి. వీళ్లకేం తెలుసు మా బాధలు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతదా? ఒక్క మడి కూడా తడవదు. కాంగ్రెస్ పాలనలో బాయికాడికి మంచాలు ఎత్తుకొని పోయేవాళ్లం. కరెంటు ఎప్పుడొస్తదోనని ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఒక్క మోటరుతో రెండెకరాల పొలం పారిస్తున్న. ఇంటికాడ ఉన్నా పారుతది. కరెంట్ పోతనే లేదు. సంవత్సరంలో రెండు పంటలు తీస్తున్న. వడ్లు దండిగా పండుతున్నాయి. పదేళ్లలో ఒక్కసారి కూడా నా మోటరు కాలిపోలేదు. ఎనుకట కాంగ్రెస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు రెండు నెళ్లకోసారి కాలిపోయేది. ఉచితంగా 24గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు ఓటు వేసి గెలిపించుకుందాం.

– బండి శ్రీనివాస్, రైతు, ఈటూరు, నాగారం మండలం



# ధరణి పోతే అరిగోసే..

## ధరణి స్థానంలో భూమాత పోర్టల్ అంటున్న కాంగ్రెస్

**పాత రెవెన్యూ వ్యవస్థనే తీసుకొస్తామనడంతో రైతుల్లో గుబులు**

**మళ్లీ వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు..**

నల్లగొండ, నవంబర్ 24 : భూమిని అమ్మాలన్నా.. కొనాలన్నా.. ఫౌతీ చేయించాలన్నా.. మ్యూటేషన్ కావాలన్నా.. వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు.. చేయి తడపడాలు.. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు.. ఇవి ధరణికి ముందు రైతుల కష్టాలు. ధరణి పోర్టల్ వచ్చాక పరిస్థితులు మారి 10 నిమిషాల్లోనే భూ క్రయవిక్రయాలు, మ్యుటేషన్ అవుతున్న నేపథ్యంలో ధరణిని తీసేస్తామిన కాంగ్రెస్ నేతలు చెబుతుండడంతో అన్నదాతల గుండెల్లో గుబులు మొదలైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేసి, దాని స్థానంలో భూమాత పోర్టల్ పెట్టి పాత రెవెన్యూ వ్యవస్థను కొనసాగిస్తామంటున్న ఆ పార్టీ నాయకుల మాటలతో రైతుల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి. ధరణి తీసేస్తే మళ్లీ వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు చేతులు తడపడం.. ఆఫీసుల చుట్టూ తిరగడం తప్పదా? అని ఆందోళన చెందుతున్నారు. భూమాత పోర్టల్‌తో రద్దయిన పహాణి మళ్లీ మనుగడలోకి వస్తే పాస్ పుస్తకాల్లో పట్టాదారు స్థానంలో ఒకరు, కబ్జాదారు స్థానంలో మరొకరి పేరుతో గొడవల కారణంగా పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిందేనా? అని జంకుతున్నారు. దాంతో అలాంటి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వొద్దని రైతులు నిశ్చయానికి వచ్చనట్లు తెలుస్తున్నది.



### పట్వారీ వ్యవస్థ వస్తే రైతులు ఆగమైతరు

తెలంగాణ రాష్ట్రం రాక ముందు పట్వారీ వ్యవస్థ వల్ల రైతులంతా ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అప్పుడు పహాణీ కావాలంటే పట్వారీ దగ్గరికి వెళ్లి పైసలు ఇవ్వాల్సి వచ్చేది. ఏదైనా రాయలన్నా, బ్యాంకు లోన్‌కు భూమి రికార్డులు కావాలన్నా ఎంతో కొంత ఖర్చు అయ్యేది. భూమి కొని పట్టా చేసుకున్న తరువాత రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా, పట్టా పాస్ పుస్తకం కావాలన్నా తాసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక కేసీఆర్ సార్ ధరణి తీసుకొచ్చి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకే దగ్గర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసి సాయంత్రం వరకు పాస్‌బుక్ ఇస్తున్నారు. ధరణి పోర్టల్ వల్ల పైరవీల ఇబ్బందులు పోయాయి. ఇప్పుడు సిస్టం బాగుంది. ధరణి తెచ్చి రైతులందరికీ రైతుబంధు ఇస్తున్నారు. ధరణి లేకపోతే రైతులు ఆగమవుతారు.

– చింతల లింగయ్య, రైతు, పర్సాయపల్లి, అర్వపల్లి మండలం



### రికార్డులు తారుమారు చేసి గోస పెడుతరు

ధరణిలో పేరు ఉంటే భూములు కబ్జా కావు అన్న భరోసా వచ్చింది. వ్యవసాయ భూములపై పట్టాదారుకు పూర్తి హక్కులుంటాయి. పాసు పుస్తకాల్లో పేరు ఉంటే వారికి రైతు బంధు కింద బ్యాంకుల్లో నగదు జమ అవుతుంది. ఈ తరుణంలో కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. భూ మాత వస్తే భూ బకాసురులు తయారవుతారు. పట్వారీ వ్యవస్థ వస్తే మంచిగున్న రికార్డులన్నీ మళ్లీ తారుమారు చేసి రైతులను గోస పెడుతరు. చిన్న కాగితం కావాలన్నా కావలికారు మొదలుకొని పట్వారీ వరకు అందరికీ సలాంలు కొడుతూ తిరగాల్సి వస్తుంది. లెక్క ముట్ట జెప్పవలసి వస్తది. ధరణి తీసేస్తే భూ సమస్యలు పెరిగి ఎంతో మంది రైతులు ఇబ్బంది పడుతారు. రైతుల మేలు కోరే బీఆర్ఎస్‌కే మా మద్దతు.

– గిన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు, హుజూర్‌నగర్

### ధరణి తీసేస్తే దళారులదే రాజ్యం

సీఎం కేసీఆర్‌కు రైతుల మీద ఎంతో ప్రేమ ఉన్నది. వారి సమస్యల మీద పూర్తి అవగాహన ఉన్నది. అందుకే రైతుబంధు, రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువుల సరఫరాతోపాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. భూములను ధరణిలో పొందుపర్చడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. దాంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సరాసరి రైతులకే లబ్ధి కలుగుతున్నది. గతంలో పటేల్, పట్వారీ, వీఆర్వో వ్యవస్థ ఉండడంతో రికార్డుల్లో చాలా అవకతవకలు జరిగేవి. వాటిని సరి చేసుకోవడానికి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కాంగ్రెస్ నాయకులు ధరణిని తీసేసి మళ్లీ పాత వ్యవస్థలను తీసుకురావాలని చూడడం మంచిది కాదు. ధరణిని ఎత్తేస్తే తిరిగి దళారుల రాజ్యం వచ్చే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

– పత్తిపాటి నాగిరెడ్డి, రైతు, కందిబండ, మేళ్లచెర్వు మండలం





### ధరణిని ఎత్తేస్తే రైతులకు మళ్లీ తిప్పలే..

కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు ధరణిని తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తయ్. అప్పట్లో పటేళ్లు, పట్వార్లు రైతులను బాగా పీడించేటోళ్లు. ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరికి భూ యజమానికి తెలియకుండా మార్చేటోళ్లు. భూమిలో ఉండేది ఒకరు.. కాగితం ఇంకొకరి పేరు మీద ఉండేది. దాన్ని మార్చాలంటే వాళ్లు అడిగినంత ఇవ్వాల్సి వచ్చేది. బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చినంక రైతులకు భూముల మార్పిడి సులభంగానే ఉన్నది. రైతులు కూడా ఈ పద్ధతి బాగుందంటున్నరు. ఒక్క పూటలోనే ఆఫీసులో పని అయితుంది. ఈ పద్ధతి కొనసాగిస్తేనే బాగుంటది. కాంగ్రెస్ మళ్లీ పాత విధానానికి పోవాలని చూస్తుంది. ధరణి తీసేస్తే రైతులకు మళ్లీ తిప్పలు తప్పవు.

– మద్ది నారాయణరెడ్డి, రైతు, చనుపల్లి, అనంతగిరి మండలం



### ధరణి పోతే రైతులకు గోసే..

కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తామంటున్నరు. ధరణి పోర్టల్ వచ్చిన సంది ఒక్కనాడే ఒకే దగ్గర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయిపోతుంది. రైతులకు తిరుగుడు తిప్పల తప్పింది. ధరణిని రద్దు చేస్తే రైతులు రిజిస్ట్రేషన్ ఆఫీసుల చుట్టూ తిరగాలె. వీఆర్వోలు, పట్వారీల వెంబడి తిరుగాలె. అయినా పని కాదు. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయినంక రైతుల అవస్థలు పోయినయ్. కాంగ్రెస్ సర్కార్ వస్తే రైతుల తిప్పలు మళ్లీ వస్తయ్. పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తామంటున్నారు. అట్లయితే రైతులు బ్రోకర్ల వెంబడి, పటేల్, పట్వారీల వెంబడి తిరిగి లంచాలు ఇవ్వాల్సి వస్తది. ఇప్పుడు పటేల్, పట్వారీ వ్యవస్థ ఎందుకు.. వారితో ఏం పని? సక్కగా నడుస్తున్న పనిని కుంటుపడనీయడానికే కాంగ్రెస్ పార్టీ సూస్తుంది.

– భువనగిరి మల్లయ్య, చిల్పకుంట్ల, నూతనకల్ మండలం